క్లుప్తంగా

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

చుంచుపల్లి: పోలీస్ శాఖ, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా మంగళవారం కొత్తగూడెంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటీ నార్కోటిక్ సొల్జర్, ఇంపాక్ట్ అధ్యక్షుడు జవ్వాది వెంకటేశ్వరబాబు, సీఐ రమేష్ మాదకద్రవ్యాల వాడకం, దుష్పరిణామాలు, నివారణ పిల్లలను ఎలా డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవాలి, డ్రగ్స్ వాడే వారి మానసిక స్థితి, శారీరక లక్షణాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఆకాశవాణి కేంద్రంలో వార్షికోత్సవం

చుంచుపల్లి: ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం ఏర్పాటై 36ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. రేడియో స్టేషన్ ప్రోగ్రాం హెడ్ భైరి శ్రీనివాసన్ అధ్యక్షతన శ్రోతలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయగా, వివిధ ప్రాంతాల శ్రోతలు హాజరై కార్యక్రమాలపై వారి అభిప్రాయాలు వెల్లడించారు. అనంతరం ప్రోగ్రాం హెడ్‌తో పాటు శ్రోతలను సన్మానించారు. స్టేషన్ నిర్వహణ అధికారి కొలిపాక శంకరరావు, ఇంజనీర్ బాబు సింగ్, బొల్లవరపు ప్రసాద్, స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో ఇద్దరికి సీట్లు

టేకులపల్లి: నవోదయ ఆరో తరగతిలో ప్రవేశం కోసం జనవరిలో జరిగిన ప్రవేశ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల అయ్యాయి. టేకులపల్లి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపారు. దంతెలతండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థి భూక్యా షణ్ముఖ్, టేకులపల్లిలోని గ్రావిటీ ప్రీమియర్ స్కూల్ విద్యార్థి బి.జయ్యుష్ నవోదయలో సీటు సాధించాడు.


ఉన్నత పాఠశాలల్లో క్రీడా సంబురం

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం, పోలారం యూపీఎస్ పాఠశాలల విద్యార్థులు మంగళవారం కొమరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఉన్నత పాఠశాలలోకి ప్రవేశించే విద్యార్థులను ఆకట్టుకునేందుకు కొమరారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ విద్యార్థులను ఆహ్వానించి పాఠశాలను పరిచయం చేశారు. పాఠశాలలో తరగతి గదులు, సౌకర్యాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి ప్రోత్సాహకంగా జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక తరగతులను ముగించుకున్న విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశానికి కొమరారం ఉన్నత పాఠశాలను ఎంచుకోవాలని సూచించారు.

ఆశా కార్యకర్తల నిరసన

జూలూరుపాడు: ఆశా కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వల్లమల్ల చందర్‌రావు మాట్లాడుతూ... అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న ఆశా వర్కర్లపై అక్రమంగా కేసులు పెట్టడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారిని అవమానపరుస్తూ ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18,000, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూనెం రూన్సీ, నీలిమ, దిప్లీ, శారద, వసుంధర, ఏసుమణి, కల్యాణి, వెంకటలక్ష్మి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అఫ్రిద్‌కు అభినందనలు



అఫ్రిద్‌ను సన్మానిస్తున్న అధికారులు

టేకులపల్లి: గ్రూప్ 1, 2, 4 తదితర పోటీ పరీక్షల్లో వరుస ఉద్యోగాలు సాధించి రాణించిన చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు అహ్మద్ రజాక్ ఫాతిమా దంపతుల రెండో కుమారుడు ఎండీ అఫ్రిద్ ప్రతిభ అభినందనీయమని టేకులపల్లి తహసీల్దార్ నాగభవానీ అన్నారు. తహసీల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అఫ్రిద్‌ను మంగళవారం తహసీల్‌లో శాలువా కప్పి అభినందించారు. నాగభవానీ మాట్లాడుతూ... అఫ్రిద్ బీఈ మెకానికల్ ఇంజనీరింగ్, పీజీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశారని తెలిపారు. గతంలో ఆర్ఆర్‌బీ, ఎన్‌టీపీసీలలో ఉద్యోగాలు సాధించారని, ప్రస్తుతం టేకులపల్లి తహసీల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గ్రూప్ 4 జిల్లాలో 3వ ర్యాంక్ సాధించి గ్రూప్ వన్‌లో 448 మార్కులు గ్రూప్ 2లో 377 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 313 ర్యాంక్, గ్రూప్ త్రీలో 22వ ర్యాంకు సాధించడం విశేషమన్నారు. జూనియర్ లెక్చరర్ పరీక్షలోనూ రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంకు హర్షణీయమన్నారు.

ఆగని ఇసుక దందా

- అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- కిన్నెరసాని, ముర్రేడు వాగుల నుంచి ఇష్టారాజ్యంగా తరలింపు
- చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా ఆగని అక్రమార్కులు



రాత్రి సమయంలో ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్

పాల్వంచరూరల్: గతంలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేసే అక్రమార్కులు ఇటీవల లారీల ద్వారా దందా కొనసాగిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా రవాణా మాత్రం ఆగలేదు. రాత్రి సమయంలో నిరాటంకంగా అక్రమంగా రవాణాను కొనసాగిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడుతోంది.

ఆదాయం వస్తుందని తెలిసినా..

పాల్వంచ మండల సరిహద్దులో ప్రవహించే కిన్నెరసాని, ముర్రేడు వాగు నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఈ కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. అక్రమార్కులు పగలు, రాత్రి తేడా లేకుండా కూలీలు, యంత్రాల ద్వారా తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని బోజ్యాతండా, తోగ్గూడెం, దంతలబోరు, బంద్రుగొండ వద్ద ముర్రేడు వాగు, నాగారం, రంగాపురం వద్ద కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కిన్నెరసాని, ముర్రేడు వాగుల్లో అధికారికంగా ఇసుక ర్యాంప్‌లను ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశముంది. అంతేకాక అటు కూలీలకు, ట్రాక్టర్ల యజమానులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అయినా ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న వారు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు.

ఓ పక్క చెక్‌పోస్టు.. ఇంకో పక్క?

కొత్తగూడెం – భద్రాచలం జాతీయ రహదారి మీదుగా నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని గుర్తించి దీనిని అరికట్టేందుకు నెల క్రితం నాగారం కాలనీ వద్ద పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు కలిసి చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. దీంతో స్మగ్లర్లు రూట్ మార్చి నాగారం నుంచి జగన్నాథపురం, తోగ్గూడెం, జగన్నాథపురం వైపు రహదారి మీదుగా రవాణా కొనసాగిస్తున్నారే కానీ దందా మాత్రం ఆపలేదు. ఇక భోజ్యా తండా వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ నుంచి, రంగాపురం సమీపంలోని కిన్నెరసాని వాగుల నుంచి అక్రమ రవాణా సాగిస్తున్నారు. చెక్‌పోస్టు భాగంలో ఉన్న నాగారం, జగన్నాథపురం రహదారి మీదుగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్తున్నా అధికారులు ఆ మార్గంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పెరిగిన నిర్మాణాలు..

ఇళ్ల నిర్మాణాలు, రహదారులకు ఇసుక పెద్దమొత్తంలో అవసరమవుతోంది. ఇదే అదునుగా అక్రమ దారులు పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడమే కాక వాగుల్లో గుంతలు తేలి భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఎదురవుతోంది. కాగా, ముర్రేడు, కిన్నెరసాని వాగుల పరిధిలో భోజ్యాతండా, తోగ్గూడెం, రంగాపురం, నాగారం, దంతలబోరు ప్రాంతాల్లో ఇసుక నిల్వలు అపారంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో ఇసుక తీసుకొచ్చి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్న పలువురు.. ఆ తర్వాత లారీల్లో కావాల్సిన వారికి సరఫరా చేస్తున్నారు. ఒక్కో లారీ ఇసుక రూ.లక్షపైగా ధర పలుకుతుండడంతో అప్పుడప్పుడు పట్టుబడినా జరిమానా చెల్లించేందుకు వెనుకాడడం లేదని సమాచారం.



ముర్రేడు వాగులో అనుమతి లేని ఇసుక ర్యాంపు

క్వారీలు ఏర్పాటు చేస్తేనే..



కిన్నెరసాని వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా నిత్యకృత్యంగా మారింది. కొందరు అధికారులు, ఇంకొందరు స్థానికులకు సైతం మామూళ్లు ముట్టజెప్పి అక్రమంగా వ్యాపారం కొనసాగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీన్ని అడ్డుకోవాలంటే ప్రభుత్వమే క్వారీలు ఏర్పాటుచేయాలి.

– వెంకటేశ్వరరెడ్డి, నారాయణరావుపేట

అధికారులు స్పందించాలి..



కిన్నెరసాని వాగులో ఇసుక ర్యాంప్‌లకు అనుమతి ఇవ్వకపోవడం అక్రమ రవాణాదారులకు కలిసొస్తోంది. ఇష్టారాజ్యంగా వచ్చినట్లు ఇసుక తవ్వడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఇకనైనా అధికారులు ర్యాంప్‌ల ఏర్పాటుపై దృష్టి సారించాలి.

– వీరన్న, పునుకుల

నిఘా పెంచాం..



ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలతో కలిసి నిఘా వేశాం. నాగారం కాలనీ వద్ద చెక్‌పోస్టు ఉంది. ఇటీవలే తొమ్మిది లారీలు, 12 ట్రాక్టర్లు సీజ్ చేసి రూ.2లక్షలకు పైగా జరిమానా విధించాం.

– వివేక్, తహసీల్దార్, పాల్వంచ

అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలు



వేడుకలో పాల్గొన్న డీబ్ల్యూఓ స్వర్ణలతా లెనీనా

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బేటీ జన్మోత్సవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమశాఖ అధికారిణి (డీబ్ల్యూఓ) స్వర్ణలతా లెనీనా హాజరయ్యారు. మాట్లాడుతూ... కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టినట్లు తెలిపారు. బాలికా శిశువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు బాలికల జన్మోత్సవ్ వేడుకలను నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. బాలికలకు ఒక్కొక్కరికి గౌనుతో పాటు స్వీట్లు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మునగ మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఏరియా స్థాయి సమావేశం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో మంగళవారం ఏరియా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సింగరేణి ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, గుర్తింపు సంఘం నేతలు కె.సారయ్య (ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ), నజీర్ అహ్మద్ (బ్రాంచి సెక్రెటరీ), దాసరి రాజారాం పాల్గొన్నారు. జీఎం కృష్ణయ్య మాట్లాడుతూ... ఇప్పటి వరకు గుర్తింపు సంఘం ప్రతినిధులు తమ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్ఓటూ జీఎం రామస్వామి, కేఓసీ పీఓ గోవింద స్వామి, పీఓ కృష్ణమోహన్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో ప్రతిభ చూపాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీరామ్మూర్తి

పాల్వంచరూరల్: విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదువుకుని ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాశాఖాధికారి శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిధి నాగారం హైస్కూల్‌లో మంగళవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం.బి.శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు, రవి, మండల బాధ్యులు పాషా, ఉపాధ్యాయులు హరి, రాంబాబు, సురేష్, రాజులు, పద్మావతి, స్వాతి, గ్రామస్తులు పాపారావు, చంచలపు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు సాధించే వరకు ఉద్యమం

ఇల్లెందురూరల్: ఆరేళ్లుగా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న పేదలకు ఇంటి స్థలాలు కేటాయించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ బాధితులకు పూలదండ వేసి రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని స్టేట్‌ఫిట్ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండా గ్రామ సమీపంలో పేదలు ఆరేళ్ల క్రితం భూపోరాటం చేసి గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. వారికి సంబంధిత స్థలాలపై హక్కు కల్పించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గతంలో పలుమార్లు ఆందోళనలు చేసి వినతిపత్రాలు అందజేశామని చెప్పారు. కానీ పాలకులు వీరి ఆందోళనను చిన్నచూపు చూస్తూ సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

పాలకులు తక్షణం స్పందించి పేదలకు న్యాయం చేయని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, వజ్జ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం..



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టుల న్యాయమైన కోరికను ప్రభుత్వం నెరవేర్చాలని, వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేదాక అండగా ఉంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని నాగేశ్వర్‌రావు, జై భీంరావ్ భారత్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన నిరసన కార్యక్రమంలో భాగంగా 6వ రోజు మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలకు నామమాత్రపు ధరకే వందల ఎకరాలు అప్పగిస్తూ, నిత్యం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తూ చాలీచాలని వేతనంతో బతుకులీడుస్తున్న జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం రూ.కోట్లు చెల్లించాలనడం ప్రభుత్వం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి వెంటనే గతంలో ఇచ్చిన జీఓను రద్దు చేసి నామమాత్రపు ధరకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల ప్రతినిధులు, స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, అడ్వకేట్‌లు మరపాక రమేష్, హరి, సంకుబాపన అనుదీప్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి జరుగుతోంది..

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. మంగళవారం జర్నలిస్టులు చేపట్టిన వంటా వార్పు నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దుర్గరాసి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించే ముందు జాగ్రత్త వహించండి..

పాల్వంచ: మున్సిపాలిటీ ట్రేడ్ లైసెన్స్ కట్టమని, ఇతర పన్నులు కట్టమని కార్యాలయ సిబ్బంది కాకుండా ఇతరులు ఫోన్ చేసి ట్యాక్స్ కట్టమని క్యూఆర్ కోడ్‌లు పంపిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, అలాంటి వాటి పట్ల పట్టణ ప్రజలు జాగ్రత్త వహించాలని పాల్వంచ కమిషనర్ కె.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి వాటి వల్ల కార్యాలయ సిబ్బందికి గానీ, యాజమాన్యానికి గానీ ఎటువంటి సంబంధం లేదని, పన్నులు కట్టించుకునేందుకు పురపాలక సిబ్బంది మీ వద్దకు వచ్చినప్పుడు, లేదా కార్యాలయానికి వచ్చి చెల్లించాలని పేర్కొన్నారు.

కాలేజీ జీవితం.. మధుర జ్ఞాపకం



కేఎస్ఎం ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): కాలేజీ జీవితం ఒక మధుర జ్ఞాపకమని కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్, సింగరేణి క్వాలిటీ జీఎం మేకల కనకయ్య అన్నారు. మంగళవారం కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని కేఎస్ఎం కళాశాలలో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇంజనీరింగ్ విద్యార్థి దశ జీవితంలో స్థిరపడటానికి తొలిమెట్టు అని ఈ కాలం ఎంతో విలువైందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బోధన, బోధనేతర సిబ్బంది రవికిరణ్, డి.కోటయ్య పాల్గొన్నారు.

కులం సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఇల్లెందు: ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ ఉపకులాలు... హోలియా దాసరి, బుడగ జంగాలు, రెల్లి, మోచి, ఇతర ఎస్సీ ఉపకులాల వారికి ఆర్డీఓచే కులం సర్టిఫికెట్లు జారీ చేయబడుతున్నాయని, కానీ మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు సకాలంలో విచారణ చేసి సర్టిఫికెట్లు జారీ అయ్యేట్లు చూడాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు బి.సమ్మక్క కోరారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన మహిళా సంఘం సమావేశంలో విచారణ జాప్యం చేయటం వల్ల సకాలంలో పత్రాలు రాక ప్రభుత్వ పథకాల్లో నష్టపోతున్నారని తెలిపారు.

రాణించిన విద్యార్థులు



విద్యార్థులతో నిర్వాహకులు

సింగరేణి(కొత్తగూడెం): నేషనల్ టాలెంట్ టెస్ట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో సింగరేణి విద్యార్థులు సత్తా చాటారు. సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న 86 మంది విద్యార్థులు నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో పాల్గొన్నారు. వీరిలో 18 మంది గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని మంగళవారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, కరస్పాండెంట్ కే.సునీల్ కుమార్, హెచ్ఎం ఏ.సాయి సుజాత, అధ్యాపకులు అభినందించారు.

‘కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల అసంతృప్తి’



మాట్లాడుతున్న మాజీ మంత్రి వెంకటేశ్వరరావు

పాల్వంచ: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా రాష్ట్రాన్ని దివాలా తీయించిందని.. తద్వారా పాలనపై అన్నివర్గాలు అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పాత పాల్వంచలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా సంపూర్ణంగా అమలు కాలేదన్నారు. ఇక పరిపాలన సైతం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర హామీల అమలుపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. కాగా, బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 27న జరగనున్న బహిరంగ సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లనున్నట్లు వనమా తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్మన్ కాపు సీతామహాలక్ష్మి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్‌తో పాటు నాయకులు వనమా రాఘవేందర్‌రావు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి, కనగాల బాలకృష్ణ, మల్లెల రవిచంద్ర, కొత్వాల సత్యనారాయణ, దాసరి నాగేశ్వరరావు, ప్రకాష్, చందునాయక్, సమ్మయ్యగౌడ్, మంజుల, గిరి, నవీన్, శివ, వీరన్న పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. మంగళవారం జూలూరుపాడు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు కేసులు, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... బేతాళపాడు గ్రామ సమీపంలోని బ్రిడ్జిపై నుంచి ట్రాలీ వాహనం పడిపోవడం పట్ల డీఎస్పీ రెహమాన్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి దురదృష్ట సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. ప్రయాణికులు, కూలీలను ట్రాలీ వాహనాల్లో తరలిస్తే యాజమానులు, డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించరాదన్నారు. వాహనాలను అతివేగంగా, మద్యం సేవించి నడపడం ప్రమాదాలకు కారణమని తెలిపారు. వాహనాదారులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. యువత క్రికెట్ బెట్టింగ్, పేకాట, కోడి పందేలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనాల తనిఖీ నిరంతరాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై బాదావత్ రవి, ట్రైనీ ఎస్సై విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీహరి కల్యాణం

పాల్వంచ: ఆపద మొక్కుల వాడా.. అనాథ రక్షకా.. శ్రీనివాసా గోవిందా.. అంటూ భక్తుల నామ స్మరణతో శ్రీనివాసగిరి మార్మోగింది. భక్తజన సదోహం నడుమ శ్రీనివాస గుట్టపై ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తహసీల్దార్ వివేక్ దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అంతకు ముందు గర్భగుడి నుంచి ఉత్సవ మూర్తులను పల్లకిలో మేళతాళాలతో కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. మంగళవాయిద్యాలతో మామిడి తోరణాల సాక్షిగా ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, ఫణిరాజాచార్యులు, హరిచార్యులు, సంతోష్ కుమార చార్యాలు, వరుణ్ కుమార చార్యులు, మణిదీపాచార్యులు, హరిచార్యుల మంత్రోచ్చారణలతో అంగరంగవైభవంగా నిర్వహించారు.

వేలాది మంది భక్తులు తరలిరావడంతో శ్రీనివాస గిరి కిటకిటలాడింది. భక్తులకు అన్నదాన ప్రసాదం అందించారు. కేటీపీఎస్ 7వ దశ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసబాబు, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఎస్ఐలు రాఘవయ్య, జీవన్ రాజ్, కల్యాణి, భక్త సమాజ మండలి అధ్యక్ష కార్యదర్శులు ఆరుట్ల లక్ష్మణ్, ధర్మపురి రాము, ఊకె భద్రయ్య, కందుకూరి రాము, శ్రీలత, బండి నారాయణ, లక్ష్మీరెడ్డి, వంకదారు నరసింహకుమార్, మిట్టపల్లి నరసింహకుమార్, కంతాల వెంకటేశ్వరరావు, నర్సిరెడ్డి, వేమూరి వెంకటేశ్వర్లు, మేదరమెట్ల వెంకటేశ్వర్లు, రమేష్, సేవాదల్ ఆర్గనైజర్లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు